# రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

**ఎమ్మెల్యే రంగారెడ్డి**



మంచాల: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల, ఏప్రిల్ 22: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టంను ప్రభుత్వం తీసుకువచ్చిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండల కేంద్రంలో మంగళవారం భూ భారతిపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరై మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. భూ సమస్య ఏదైనా మండల స్థాయి, డివిజన్ స్థాయిలోనే అధికారులు వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, ఎంపీడీవో బాలశంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎల్లేశ్, పాండునాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సభా వేదికపై అంతా కాంగ్రెస్ నాయకులే ..**

భూ భారతిపై కల్పించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్డీవోతో పాటు కొందరు ప్రజాప్రతినిధులు సభా వేదికపై కూర్చోవాల్సి ఉండగా ఇష్టానుసారంగా కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సభా వేదికపై కూర్చొని ప్రొటో కాల్‌ను మరిచారని అక్కడికి వచ్చిన రైతులు అసహనం వ్యక్తం చేశారు.

**యాచారం :** మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టం– 2025పై ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. భూభారతి విధి విధానాలపై ప్రొజెక్టర్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, డైరెక్టర్ నర్సింహ, తహసీల్దార్ అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్, ఆర్ఐలు మురళికృష్ణ, రామకృష్ణ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, రమేశ్, వెంకట్‌రెడ్డి, ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు గణేష్, నిరంజన్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యయాదవ్ పాల్గొన్నారు.

**డ్వాక్రా సంఘాల మహిళలతో నిండిన హాల్**

యాచారంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సు సమావేశం డ్వాక్రా సంఘాల మహిళలతో నిండిపోయింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఫార్మా బాధిత రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. తమ సమస్యలను వివరించేందుకు సమావేశానికి వచ్చామని, అవగాహన సదస్సుకు రాలేదని ఫార్మా బాధిత రైతులు పేర్కొన్నారు.

# లబ్ధిదారుల ఎంపికపై సర్వే

**ఇందిరమ్మ ఇండ్ల అర్హుల వివరాలు సేకరిస్తున్న అధికారులు**



ఆమనగల్లు : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా పోలేపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీడీవో మాధురి

కేశంపేట, ఏప్రిల్ 22: కేశంపేట మండల కేంద్రంతోపాటు చెవులపల్లి, బొదునంపల్లి, కాకునూరు, పాటిగడ్డ, లేమామిడి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను అధికారులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీవో కిష్టయ్య, పీఆర్ఏఈ నర్సింగరావు, డిప్యూటీ తహసీల్దార్ గీత, ఇరిగేషన్ ఏఈ గీతలు ఆయా గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. బొదునంపల్లిలో జరిగిన సర్వే తీరును ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి పరిశీలించారు.

**ఆమనగల్లు :** ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం వెరిఫికేషన్ ప్రక్రియ ఆమనగల్లు మండలంలో ప్రారంభమైంది. మంగళవారం ఎంపీడీవో కుసుమ మాధురి పోలేపల్లి గ్రామంలో పర్యటించి ఈ ప్రక్రియను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో వినోద, పంచాయతీ కార్యదర్శి పవన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.



ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

## భూ పరిహారాన్ని పెంచి రైతులను ఆదుకోవాలి

కడ్తాల్, ఏప్రిల్ 22: కడ్తాల్ మండల కేంద్రం సమీపం నుంచి వెళ్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. మంగళవారం కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో విద్యుత్ లైన్ బాధిత రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి మహేశ్వరం పవర్‌స్టేషన్ వరకు నిర్మిస్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్, కడ్తాల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 66 సర్వే నంబర్లలో ఉన్న భూముల మీదుగా వెళ్తున్నదని తెలిపారు. ఈ లైన్ ఏర్పాటుతో దాదాపు 150 మంది రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇప్పించాలని ఆర్డీవోను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో రాములుయాదవ్, సీహెచ్.మహేశ్, నర్సింహముదిరాజ్, కృష్ణయాదవ్, శ్రీరాములుగౌడ్, వెంకటేశ్‌కురమ, యాదయ్య, జంగయ్యయాదవ్ ఉన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషణమాసంలో పాల్గొన్న మహిళలు

కేశంపేట, ఏప్రిల్ 22: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శబాన పోషణమాసంలో పాల్గొని మహిళలకు పలు సూచనలు, సలహాలు చేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ప్రతిరోజు పాలు, పండ్లు, ఆకు కూరలు, పప్పుదినుసులు, చిరు ధాన్యాలవంటి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రేమలత, సులోచన, వనజాత, జయమ్మ పాల్గొన్నారు.

# సత్తాచాటిన ఇంటర్ విద్యార్థులు

మొయినాబాద్, ఏప్రిల్ 22 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో సత్తాచాటారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లో విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కె శశికిరణ్987/1000, బి భానుతేజ 986/1000 మార్కులు, బైపీసీలో ఏ సాయికుమార్ 981/1000, కె కృష్ణమోహన్ 980/1000, ఎస్ భానుప్రసాద్ 980/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎండీ జాఫర్ 467/470, బి.శివకుమార్ 465/470, బైపీసీలో వి.అభిరామన్ 432/440, కె.వినయ్ తేజ్ 431/440, డి.చరణ్431/440 మార్కులు సాధించారు.

**చేవెళ్ల గురుకుల కళాశాల...**

మొయినాబాద్ మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల కళాశాలలో ఫస్ట్ ఎంపీసీలో 81 శాతం, ఫస్ట్ బైపీసీలో 89.7 శాతం,సెకండ్ ఎంపీసీ విద్యార్థులు 75 శాతం, సెకండ్ బైపీసీ విద్యార్థులు 100 శాతం ఫలితాలను సాధించారు.ప్రథమ సంవత్సరం 85.5 శాతం, ద్వితీయ సంవత్సరంలో 88.7 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో వి.ధనలక్ష్మి 954, సాయికృప 932, జి.తేజ 936, సెకండ్ బైపీసీలో టి.స్ఫూర్తి 976, డి.అక్షిత 947, ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థులు బి.యశ్విని 448/470, సాత్విక 433/470, దీపిక 428/470, టి.నందిని 405/470, బి.ఐశ్వర్య 404/470, ఎన్.శ్రావణి 403/470, టి.రేవతి 402/470 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో టి.కీర్తన 422/440, ఎ.కీర్తన 419/440, జె.హరిప్రియ 419/440, పి.గీత 405/440, ఇ.అక్షయ 495/400, కె.జోత్స్న 405/440, వి.మౌనిక 404/440 మార్కులతో ఉత్తమ ప్రతిభను కనబర్చినారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ పి.మాలతీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

**ఇబ్రహీంపట్నంలో..**

ఇబ్రహీంపట్నం : ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు మరోసారి సత్తా చాటారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు రెసిడెన్షియల్ బాలికలు, బాలుర కళాశాలలతో పాటు కస్తూర్బాగాంధీ గురుకుల కళాశాల విద్యార్థులతో పాటు ఇబ్రహీంపట్నంలోని పలు ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులు ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి బాలబాలికలు తమ సత్తా చాటారు.

**చేవెళ్లటౌన్ :** ఇంటర్ ఫలితాల్లో చేవెళ్ల ఆదర్శ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన విద్యార్థిని ఎంపీసీలో శృతిలయ 468/470, బైపీసీలో స్పందన 417/ 440, ద్వితీయ సంవత్సరంలో ఎంపీపీలో సర్బాజీత్ 974/ 1000, శ్రావణి 949/1000 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

**షాద్‌నగర్‌టౌన్ :** ఇంటర్ ఫలితాల్లో షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ సర్వేశ్వర రెడ్డి మంగళవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో మానస 500/493, బైపీసీలో ఆయేషాబేగం 440/426, ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో స్వరూప 1000/959, వైష్ణవి 1000/954, కంప్యూటర్ సైన్స్‌లో ఆశ 1000/932 మార్కులు సాధించారు.

## అఘోరి అరెస్ట్

**యూపీలో అదుపులోకి తీసుకున్న మోకిలా పోలీసులు**

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 22 : కొన్నాళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన అఘోరి (శివ విష్ణు బ్రహ్మ అల్లూరి అలియాస్ శ్రీనివాస్)ని మోకిలా పోలీసులు అరెస్ట్ చేశారు. పూజల పేరుతో ఓ మహిళను చీటింగ్ చేసిన అఘోరిపై మోకిలా పీఎస్ లో కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన పోలీసులు... ఐదుగురు బృందంగా వెళ్లి మంగళవారం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నారు. ఆమెతో పాటు ఇటీవల పెళ్లి చేసుకున్న వర్షిణిని కూడా నగరానికి తీసుకొస్తున్నారు. అయితే ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**ఇదీ కేసు..**

శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు రెవెన్యూలోని ప్రగతి రిసార్ట్‌లో నివసిస్తున్న వినితా బీటీ అనే మహిళ ఓ పుణ్యక్షేత్రం వద్ద పూజలు నిర్వహించేందుకు లేడీ అఘోరిని సంప్రదించింది. ఇందుకు రూ.9.80 లక్షలు కావాలని చెప్పడంతో ఆమె ఒప్పుకుంది. ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించిన తర్వాత మరిన్ని డిమాండ్ చేయడంతో వినితా ఫిబ్రవరిలో మోకిలా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ఉండగానే... అఘోరి ఏపీకి చెందిన వర్షిణిని ప్రేమ పేరుతో తన వెంట యూపీకి తీసుకెళ్లడం సంచలనంగా మారింది. కుటుంబ సభ్యులు పోలీసుల సాయంతో ఇంటికి తీసుకొచ్చినప్పటికీ.. కొన్నాళ్లకే అఘోరి వర్షిణిని కేదార్‌నాథ్ తీసుకెళ్లి వివాహం చేసుకుంది. దీంతో వీరిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడంతో తాము తెలుగు రాష్ట్రాలకు రాబోమని, కేదార్నాథ్ వెళ్తున్నామని, తమను అరెస్ట్ చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని వారం కింద వీడియో కూడా రిలీజ్ చేశారు. దీని ఆధారంగా పోలీసులు... అఘోరిని పట్టుకునేందుకు ఒక ఎస్సై, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్, ఒక మహిళా కానిస్టేబుల్... ఐదుగురు బృందంగా ఏర్పడ్డారు. లొకేషన్ ట్రేస్ చేస్తూ వెళ్లారు. మంగళవారం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్నట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కుమ్మరిగూడలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ కాంతారెడ్డి

షాబాద్, ఏప్రిల్ 22: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ సీఐ కాంతారెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో ఎస్ఐ రమేశ్‌తో కలిసి ప్రజలకు సైబర్ నేరాలపై, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువకులు ట్రిబుల్ రైడింగ్, అతి వేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

# ఉపాధి హామీ నిధులను విడుదల చేయాలి



ఉపాధికూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 22 : పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కడియాలకుంట తండాలో ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా మేటుగా పనిచేస్తున్న ఉపాధిహామీ కార్మికులను ఫీల్డ్‌అసిస్టెంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస పనిదినాలను 200వరకు పెంచాలని, ఉపాధికూలీని రూ.800లకు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధినిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు శంకర్, దీప్లా, లింగంనాయక్, సంతోష్‌నాయక్, ముత్యాలు, గౌరిశంకర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## భూ సమస్యలు పరిష్కరించండి

మంచాల, ఏప్రిల్ 22: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలంటూ మంగళవారం మంచాల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంచాల మండలంలో ఎంతో మంది రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, కృష్ణ, యాదయ్య, అజయ్‌బాస్, జంగారెడ్డి పాల్గొన్నారు.

## సివిల్స్‌లో షాద్‌నగర్ విద్యార్థిని ప్రతిభ



ఇంద్రార్చిత

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 22: యూపీఎస్సీ ఫలితాల్లో షాద్‌నగర్ పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన రాఘవేందర్‌రావు కుమార్తె ఇంద్రార్చిత మంగళవారం ర్యాంక్‌ను సాధించింది. ఆల్ ఇండియాలో 739ర్యాంక్ సాధించిందని ఆయన తెలిపారు. తన కుమార్తె గత కొంత కాలంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుందని, సివిల్స్ ఫలితాల్లో ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇంద్రార్చిత పట్టుదలతో చదివి ఆల్ ఇండియాలో ర్యాంక్ సాధించడం పట్ల షాద్‌నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సివిల్స్ ర్యాంక్ సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 22 : గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మాజీ సర్పంచ్ శేరి శివారెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధి మల్కాపూర్ వార్డులోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం శేరి శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేశామని, ముమ్మందు మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జాఫర్, స్థానిక నేతలు రవికుమార్, మజర్, ఇక్రం, కుమార్, మల్లేష్, యాదగిరి, రాములు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ




పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 22: విద్యార్థులు, సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాలను రూపొందించాలని టీచర్ ఎమ్మెల్సీ, కాలేజీ చైర్మన్ కొమరయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు విశ్వ ప్రకాశ్‌బాబు, వీ సైదులు, బీ రాజు ఎలక్ట్రిక్ అండ్ హైబ్రిడ్ వెహికిల్స్, డిజైన్ ఫండమెంటల్స్ పేరిట రచించిన పుస్తకాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డైరెక్టర్ రామ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, అడ్మినిస్ట్రేటివ్ డీన్ శ్రీధర్, కాలేజీ ప్రతినిధులు రాజేందర్‌రెడ్డి, సాయి హరీశ్, రవి, రమ్య, శ్రీనివాస్, నవ్య, ప్రియంవధ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

షాబాద్, ఏప్రిల్ 22: పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్, మద్దూర్ తండాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాల్‌రాజు, శ్రీను, కృష్ణమూర్తి, రైతులు తదితరులున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 22: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బాటసింగారం గ్రామ పరిధిలోని దేశ్‌ముఖ్ రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని ఆ గుర్తు తెలియని వ్యక్తి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, ఇందిరమ్మ కాలనీ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుంటాడని పోలీసులు తెలిపారు. అనారోగ్య కారణాలతో చనిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రజతోత్సవ బహిరంగ సభకు పాదయాత్ర



రజతోత్సవ సభకు పాదయాత్రగా బయల్దేరిన మల్లేశ్

కడ్తాల్, ఏప్రిల్ 22: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ యువ నేత పాదయాత్రగా బయల్దేరాడు. తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామాధ్యక్షుడు కుమ్మరి మల్లేశ్ తన మిత్ర బృందంతో కలిసి, వరంగల్‌లో జరగునున్న బీఆర్ఎస్ సభకు బయల్దేరాడు. ఈ మేరకు సోమవారం రాత్రి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో కాలినడకన సభకు వెళ్తున్నట్లు మల్లేశ్ తెలిపారు. పాదయాత్రలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, గ్రామాధ్యక్షుడు రమేశ్, నాయకులు అంజయ్యగౌడ్, లింగయ్య, స్వామిగౌడ్, రాములు, మహేశ్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, మహేశ్, శ్రీకాంత్, రామకృష్ణ, బాలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# కార్మికులు హక్కుల కోసం పోరాడాలి



షాబాద్, ఏప్రిల్ 22: మేడే స్ఫూర్తిగా కార్మికులు హక్కుల కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మంగళవారం సీఐటీయూ షాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో దేవేందర్ మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. 8 గంటల పని అమలు కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ కార్మికుల హక్కులకు నాంది పలికిన మే డేను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ షాబాద్ మండల ఉపాధ్యక్షుడు నర్సింహ, గ్రామ పంచాయతీ యూనియన్ షాబాద్ మండల కార్యదర్శి అర్జున్, ఉపాధ్యక్షుడు రవి, సాయిలు, నర్సింహులు, రత్నమ్మ యాదమ్మ, లక్ష్మి, రమాదేవి, బాబయ్య పగులయ్య పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 22 : ఇబ్రహీంపట్నం విశ్వభారతి ఉన్నత పాఠశాలలో 1993–94సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ రిసార్ట్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి తమ చిన్ననాటిజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.


# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన



అప్పారెడ్డిపల్లి గ్రామంలో బాడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మాడ్గుల, ఏప్రిల్22: మండల పరిధిలోని అప్పారెడ్డి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉన్న పిల్లల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన లభిస్తుందన్నారు. కార్యక్రమంలోని పాఠశాల అభివృద్ధి దాత గోవింద్ శ్రీధర్, హెచ్ఎం మంగ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

## కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఆదిబట్ల, ఏప్రిల్ 22: కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మంగళవారం ఆదిబట్ల టీసీఎస్ ఎదురుగా ఉన్న శ్రీ మిత్ర కాలనీ వాసులు ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో అండర్‌డ్రైనేజి, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, సీసీరోడ్లు, పార్కు స్థలాలను అభివృద్ధి చేయడం లేదని వారు అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ 2గా ప్రమోషన్ పొందడంతో ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎం క్రిష్ణారావు, చందు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు.. బీటెక్ విద్యార్థి దుర్మరణం

మొయినాబాద్, ఏప్రిల్22: ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నంధ్యాల జిల్లాలోని పిరుసుహాబ్‌పేటకు చెందిన చిన్న వీరారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సన్‌సిటీలో నివాసం ఉంటున్నారు. తన కుమారుడు ఆర్ వినయ్‌కుమార్ మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో గల కేఎల్‌యూ విశ్వవిద్యాలయంలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం (మంగళవారం తెల్లవారుజామున) రాత్రి 2.30 గంటల సమయంలో వినయ్‌కుమార్ తన స్నేహితులు వైష్ణవ్‌అభిగ్నవ్, చరిత్‌కార్తీక్ కలిసి బైక్‌పై సన్ సీటీ నుంచి మొయినాబాద్‌లోని గండిపేట్ చౌరస్తా నుంచి గండిపేట చెరువు వైపు వెళ్తున్నారు. అదే సమయంలో గండిపేట చెరువు నుంచి మొయినాబాద్ వైపు కారు వస్తుండగా, ఆ సమయంలో కారు బైక్‌ను ఢీకొట్టడంతో వినయ్‌కుమార్‌కు చేతి విరగడంతో పాటు తలకు బలమైన దెబ్బ తగిలింది. దీంతో వినయ్‌కుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వారి స్నేహితులైన స్నేహితులు వైష్ణవ్‌అభిగ్నవ్, చరిత్‌కార్తీక్‌లకు గాయాలయ్యాయి. కారు డ్రైవర్ మణికొండకు చెందిన షేక్ హనీఫ్‌గా గుర్తించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్, ఏప్రిల్22: పరుగుల మందు సేవించి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామంలో మల్లన్న జాతరను పురష్కరించుకుని ఈ నెల 17న స్వామి వారికి గంగ తెప్ప తీసిన సందర్భంగా దొడ్డె సుదర్శన్(66) మద్యం సేవించాడు. మద్యం మత్తులో షిఫ్ట్ కారును పాడు చేశాడని కుమారుడు శ్రీశైలం తిట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన సుదర్శన్ అదే రోజు రాత్రి 11:30 గంటలకు వ్యవసాయ బోరు బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి అతడి దవాఖానకు తీసుకెళ్లారు. తరువాత మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఏ దవాఖానకు ఈ నెల 18న తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న సుదర్శన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.